ఈనాడు
ఏలూరు
మంగళవారం అక్టోబరు 1, 2024

'మీకోసం'లో 271 వినతులు



ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో 'మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆర్డీవో ఖాజావలి, ఎస్‌డీసీలు భాస్కరరావు, ముక్కంటి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వినతులకు తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 271 వినతులు అందాయని అధికారులు తెలిపారు. వాటిలో కొన్ని ఇలా..
★ తమ ఇంటి స్థలం ఆక్రమణకు గురవుతోందని, దానికి సరిహద్దులు నిర్ణయించి, ఆక్రమణలు తొలగించాలని ఏలూరు తంగెళ్లమూడికి చెందిన సీహెచ్ బాలకృష్ణ వినతి పత్రం ఇచ్చారు. ★ పిపర్‌మెంట్ సొసైటీని రద్దు చేసి రెవెన్యూ అధికారితో దర్యాప్తు చేయించి చెరువును కాపాడాలని పెదపాడు మండలం కలపర్రుకు చెందిన లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ★ తన కుమారునికి తాత రాసిన వీలునామా ప్రకారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేయాలని పెదవేగి మండలం వంగూరుకు చెందిన సంపత్‌కుమార్ వినతి పత్రం ఇచ్చారు. ★ తన భూమిని ఆన్‌లైన్ చేసి అడంగల్‌లో నమోదు చేయాలని చింతలపూడి మండలం తీగలవంచకు చెందిన వెంకటేశ్వరరావు అర్జీ అందజేశారు. ★ జంగారెడ్డిగూడెంలో ప్రభుత్వ నిబంధనలు పాటించని పెట్రోలు బంకుల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ విన్నవించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో అక్టోబరు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పింఛన్ల పంపిణీపై సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద 2,64,966 మందికి రూ. 113.24 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 1న పింఛను పొందలేకపోయిన వారికి 2న గాంధీ జయంతి సెలవు కావడంతో 3వ తేదీన అందజేస్తామని వివరించారు.

బండెనక బండి.. పొగాకు బేళ్లండి!



కొయ్యలగూడెం వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు చివరి దశకు చేరాయి. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం పెద్ద ఎత్తున ట్రాక్టర్లలో బేళ్లు తీసుకొచ్చారు. వేలం కేంద్రంలో ఖాళీ లేకపోవడంతో జాతీయ రహదారిపైనే సుమారు కిలోమీటరు మేర గంటల తరబడి ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం చూర బేళ్ల అమ్మకాలు మరో నాలుగు రోజుల్లో ముగుస్తాయని వేలం కేంద్రం నిర్వాహకురాలు గ్రేస్ మార్గరెట్ తెలిపారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం

అంతరిక్షం చూసొద్దాం!



ప్రత్యక్షంగా ఇస్రోను సందర్శించే అవకాశం లేని వారికి సైన్స్ పరిశోధనలు, రాకెట్ల నమూనాలను చూపించాలనే సంకల్పంతో ఇస్రో నిర్వాహకులు 'స్పేస్ ఆన్ వీల్స్' పేరిట రూపొందించిన బస్సు సోమవారం ఏలూరులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులోని ప్రదర్శనాంశాలు విద్యార్థులను ఆలోచింపజేశాయి.



వివిధ పాఠశాలలకు చెందిన 3,394 మంది విద్యార్థులు అంతరిక్ష మహా యాత్ర బస్సును సందర్శించారు - న్యూస్‌టుడే, ఏలూరు అర్బన్

విద్యుత్తు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్సు అధికారి కె.వి.రామకృష్ణ ప్రసాద్ అన్నారు. ఏలూరులోని విద్యుత్తు విజిలెన్సు కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. చౌర్యం కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ప్రమాదాలను తగ్గించే దిశగా తరచూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆయిల్‌పామ్ రైతులు విద్యుత్తు అధికారులతో సంప్రదించి ఎల్‌సీ తీసుకున్న తరువాతే తోటల్లో గెలలు కోయడం మొదలుపెట్టాలని, అప్పుడే ప్రమాదాలు జరగవన్నారు. భవన నిర్మాణాలు జరిగేటప్పుడు దగ్గరగా విద్యుత్తు తీగలు వెళ్తే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యార్థి భవితవ్యానికి అపార్



ఈనాడు డిజిటల్, భీమవరం, అత్తిలి, న్యూస్‌టుడే : అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు కార్డులకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోవాలని విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించడంతో జిల్లాలో సోమవారం నుంచి ప్రక్రియ మొదలుపెట్టారు. అక్టోబరు 14 వరకే సమయం ఉండటంతో తల్లిదండ్రులకు అనుమతి పత్రం ఇచ్చి, దానివల్ల కలిగే ఉపయోగాలను విద్యాశాఖ అధికారులు వివరిస్తున్నారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ దీనికి శ్రీకారం చుట్టింది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక్కో నంబరు కేటాయించి, తదనుగుణంగా వారి సమాచారం నిక్షిప్తం చేస్తారు. ముందుగా 9, 10 తరగతి విద్యార్థులకు తర్వాత కేజీ నుంచి పీజీ వరకు పూర్తి చేయనున్నారు.

ప్రయోజనం ఇలా.. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. అకాడమీ పరంగా జీవితకాల గుర్తింపు కార్డుగా పరిగణిస్తారు. ఆన్‌లైన్‌లో నంబరు లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కేజీ టు పీజీ సమాచారం మొత్తం తెలుస్తుంది. విద్యార్థి బ్యాంకు ఖాతా (అకాడమీ), డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో కీలకమవడంతో వాటన్నింటినీ ప్రామాణికంగా తీసుకుంటున్నారని డీఈవో నాగమణి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలు	3,179
ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు	2.56 లక్షలు
ప్రైవేటు పాఠశాలలు	4,250
విద్యార్థులు	5.20 లక్షలు

రైతేరాజు — మొక్కవోని దీక్ష.. సత్ఫలితాల దక్షత..! | ఎండాకు తెగులు ఆశిస్తే దిగుబడిపై ప్రభావం
6లో

మూగజీవాలతో చీకటి దందా

యథేచ్ఛగా అక్రమ రవాణా | సంతల్లో గుట్టుగా క్రయ విక్రయాలు | సరిహద్దులు దాటించి విదేశాలకు మాంసం ఎగుమతి | నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

ఉమ్మడి జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంతల ముసుగులో గుట్టుగా వేలాది ఆవులు, గేదెలను కబేళాలకు తరలించేస్తున్నారు. రాష్ట్ర సరిహద్దులు దాటించి రూ. కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు. వాటి మాంసం వివిధ దేశాలకు ఎగుమతి చేస్తూ మూగజీవులతో చీకటి వ్యాపారం చేస్తున్నారు. నిరోధించాల్సిన పోలీసులు, అధికారులు ముడుపుల మత్తులో మిన్నకుంటున్నారు.



➠ పాలకొల్లు, పెంటపాడు పశువుల సంత ముసుగులో యథేచ్ఛగా పశువుల రవాణా జరుగుతోంది. తాడేపల్లిగూడెం, భీమవరం, కలిదిండి గుడివాడ మీదుగా విజయవాడ తరలిస్తున్నారు. అక్కడి నుంచి మెదక్, వరంగల్, హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నారు. అక్కడ మాంసం ప్యాకింగ్ చేసి ఇతర దేశాలకు తరలిస్తున్నారు.

ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే- జంగారెడ్డిగూడెం పట్టణం, నూజివీడు పట్టణం

➠ కొద్ది రోజుల క్రితం హనుమాన్ జంక్షన్ నుంచి ఆవుల రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. భారీ కంటైనర్‌లో 50 ఆవులను హైదరాబాద్ తీసుకువెళుతుండగా నూజివీడు మండలం తుక్కులూరు సమీపంలో గుర్తించారు. ఈ మార్గంలో నిత్యం ఇబ్రహీంపట్నం మీదుగా భారీగా పశువులను హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నారు.



ఇవి జంగారెడ్డిగూడెం సంత నుంచి కబేళాలకు తరలిస్తున్న పశువులు. ప్రతి వారం జరిగే సంతలో తక్కువ రేటుకు కొని ఇలా వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్ తరలిస్తున్నారు. ఒక్కో వాహనంలో దాదాపు 20 వరకు పశువులను అడ్డదిడ్డంగా ఎక్కిస్తారు. అధికారుల కనుసన్నల్లోనే ఇది జరుగుతోంది. కొందరు ముఠాగా ఏర్పడి అధికారులకు ముడుపులిచ్చి వీటిని తరలిస్తున్నారు. చెక్‌పోస్టుల్లో సైతం తనిఖీలు చేయకుండా అధికారులకు ముడుపులు ముట్టజెబుతున్నారు.

సంతలో సడేమియా.. ఉమ్మడి జిల్లాలో మొత్తం ఎద్దులు, ఆవుల కలిపి 1.90 లక్షల వరకు ఉన్నాయి. గేదెలు 6.12 లక్షలు ఉన్నాయి. వీటిలో ఏటా 10 శాతం వరకు వట్టిపోతాయి. మరికొన్ని అనారోగ్యం పాలవుతాయి. వీటిని కొందరు వ్యాపారులు రాజకీయ అండతో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రెండు జిల్లాల్లో జంగారెడ్డిగూడెం, కైకలూరు, పెంటపాడు, పాలకొల్లులో వారానికి ఒకసారి జరిగే సంతల ముసుగులోనే కొందరు వ్యవహారం నడిపిస్తున్నారు. దళారుల సహకారంతో పశువులను హైదరాబాద్, మెదక్, వరంగల్, కోదాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు గుట్టుగా రవాణా చేస్తున్నారు. అక్కడి కబేళాల్లో విక్రయిస్తున్నారు. మాంసాన్ని ప్యాకింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

జేబులు నింపుకొంటున్నారు.. 1960 జంతు పరిరక్షణ చట్టం ప్రకారం పశువులను వధించడం చట్టరీత్యా నేరం. అయినా వ్యాపారం జోరుగా సాగుతోంది. వట్టిపోయిన పశువులను రైతుల నుంచి రూ.5-10వేల మధ్య దళారులు కొనుగోలు చేస్తున్నారు. వారు మాత్రం రూ.15-20వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పశువుల మాంసమే కాదు చర్మం, కొమ్ములు, ఎముకలు ఇలా అన్నీ ఉపయోగపడతాయి. చెప్పులు, వాయిద్య పరికరాలు, ఎరువుల తయారీలో వినియోగిస్తారు. దీంతో భారీ డిమాండ్ ఉంది.

కళ్లు మూసుకున్నారు.. ఈ విక్రయాలు, రవాణా జరగకుండా చూడాల్సిన పశుసంవర్ధక, పోలీస్, మార్కెటింగ్ శాఖలు కళ్లు మూసుకున్నాయి. సంతల్లో విక్రయాలు జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోరు. దారిలో రవాణా చేస్తున్నా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులున్నా లేనట్టే ముడుపులిచ్చి కథ నడిపిస్తున్నారు. నూజివీడులో ఓ వైకాపా నాయకుడి ఆధ్వర్యంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. అతనే కొందరు దళారులతో జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాలనుంచి పశువులను రవాణా చేస్తున్నారు. ఈ అంశమై మార్కెటింగ్ ఏడీ మహేంద్రనాథ్‌ను వివరణ కోరగా ..తన దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

దసరాలో పేదలకు పప్పన్నం!

- చౌక సరకుల్లో ఈ నెల కందిపప్పు పంపిణీ
- ఉమ్మడి జిల్లాకు 359 టన్నులు మంజూరు

పాలకొల్లు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రావడంతోనే చౌక దుకాణాల ద్వారా పేదలకు అందించే సరకులను ఒక్కొక్కటిగా పెంచుతూ వస్తోంది. గత నెల నుంచి పంచదార పంపిణీ ప్రారంభించిన పౌరసరఫరాల శాఖ ఈ నెల నుంచి నెమ్మదిగా కంది పప్పును ఇవ్వడానికి రంగం సిద్ధం చేసింది. అయిదేళ్ల వైకాపా పాలనలో కేవలం చౌక బియ్యం అది కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవి తప్ప, ఒక్క సరకు ఇచ్చిన పాపాన పోలేదు. నింగినంటుతున్న నిత్యావసర ధరల్లో కందిపప్పు ప్రథమ స్థానంలో కొనసాగుతున్నందున దాని పంపిణీ పేద కుటుంబాలకు ఊరటగా నిలిచింది. ఈ నెల 3 నుంచి దసరా నవరాత్రుత్సవాలు ప్రారంభమవుతున్న తరుణంలో పేదింట్లో పప్పన్నం సిద్ధమవుతోంది.



రూ. 4 కోట్లు లబ్ధి.. వాస్తవానికి కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్లో రూ.170 పలుకుతోంది. చౌక దుకాణాల్లో ఈ ధర రూ.67గా ఉంది. ఈ నెల 359 టన్నులు పంపిణీ చేస్తున్నందున కార్డుకు రూ.93 లబ్ధి చేకూరనుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్డుల మీద రూ.3,99,77,000 లబ్ధి కలుగుతుంది.

30 శాతంతో మొదలు.. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11,98,695 బియ్యం కార్డులుండగా మొత్తం అందరికీ కిలో చొప్పున కందిపప్పు ఇవ్వాలంటే నెలనెలా 1,198 టన్నులు అవసరమవుతుంది. ఇప్పటివరకు కందిపప్పునకు ఉన్న డిమాండ్‌తో గత ప్రభుత్వం మొత్తం సరఫరా నిలిపేసింది. నెమ్మదిగా పంపిణీని మళ్లీ గాడిలో పెట్టాలనుకుంటున్న కూటమి ప్రభుత్వం ఈ నెల 30శాతం కార్డులకైనా కందిపప్పు ఇవ్వాలని నిర్ణయించింది. అందుబాటులో ఉన్నమేరకు ఉమ్మడి జిల్లాకు 359 టన్నులు సరఫరా చేసింది. నేటి నుంచి కార్డుదారుల్లో నిరు పేదలకు పంపిణీ చేయాలని భావిస్తుంది.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
మొత్తం కార్డులు	6,31,044	5,67,651
ఎండీయూ వాహనాలు	395	360
మంజూరైన కందిపప్పు (టన్నుల్లో)	189	170

పైసా విదల్చలేదు పని కదల్లేదు



ఇది ఏలూరు జిల్లా నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని వీవో భవనం. ఏడేళ్ల కిందట నిర్మాణం చేపట్టి వదిలేయడంతో గోడలు చెమ్మగిల్లి క్రమక్రమంగా దెబ్బతింటున్నాయి. వర్షపు నీరు నిలిచి శ్లాబు దెబ్బతింటోంది. మరికొన్ని రోజులు ఇలాగే వదిలేస్తే శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉంది.

గణపవరం, న్యూస్‌టుడే: గత తెదేపా ప్రభుత్వ హయాంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు బీజం పడింది. వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయం సహాయక సంఘాలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు పెద్దగా చదువుకోకపోయినా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారు. వీరికి అవసరమైన శిక్షణ తరగతులు, సమావేశాలను మండల సమాఖ్య కార్యాలయాల్లో నిర్వహించాల్సి వస్తున్నందున తగిన సదుపాయాలు కల్పించేందుకు 2017లో భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో విలేజ్ ఆర్గనైజేషన్ (వీవో) భవనాలు నిర్మించి అక్కడే మహిళలు సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహించుకునేందుకు వీటికి బీజం వేశారు. వీటి నిర్మాణానికి నరేగా నిధులు రూ.7 లక్షలు, డీఆర్‌డీఏ నిధులు రూ.3 లక్షలు విడుదల చేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరం నిర్మాణాలు ప్రారంభించి నిధులున్నంత వరకు పనులు చేశారు. మరికొన్ని చోట్ల పనులు ప్రారంభించలేదు.



ఈ వీవో భవనం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం సరిపల్లెలోనిది. ఏడేళ్ల కిందట నిర్మించిన దీన్ని అసంపూర్తిగా వదిలేయడంతో పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. వర్షాలకు గోడలు దెబ్బతిన్నాయి. ఇది ప్రస్తుతం ఆకతాయిలకు అడ్డాగా మారి శిథిల దశకు చేరుకుంటోంది. మరో రూ.5 లక్షలు వెచ్చిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది.

అయిదేళ్లూ పట్టించుకోలేదు
వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి ఊసే పట్టించుకోలేదు. వీటి నిర్మాణానికి అవసరమయ్యే నిధులు విడుదల చేయాల్సి ఉన్నా అయిదేళ్లలో ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ఫలితంగా అవి అసంపూర్తిగా ఉండిపోయాయి. పలుచోట్ల ఇవి శిథిల దశకు చేరుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వీటికి అవసరమైన నిధులు విడుదల చేసి వినియోగంలోకి తీసుకొస్తే స్వయం సహాయక సంఘాల మహిళలకు ఊతమిచ్చినట్లవుతుందని నారీమణులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి..
పౌరసరఫరాల సంస్థ నుంచి ధాన్యం కొనుగోళ్ల కమీషన్ తమ శాఖకు సుమారు రూ.120 కోట్ల వరకు రావాల్సి ఉంది. ఆ నిధులు విడుదలైతేనే వీవో భవనాలను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. కొత్త ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని ఆశిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
- ఎం.ఎస్.ఎస్.వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా

ఉమ్మడి జిల్లాలో ఇలా..	
మొత్తం మంజూరైన భవనాలు	725
కేటాయించిన నిధులు	రూ.94.25 కోట్లు
గ్రామ సమాఖ్యకు అప్పగించినవి	175
నిర్మాణం పూర్తయినవి	37
ఇంకా ప్రారంభం కానివి	69
వివిధ దశల్లో ఉన్నవి	443

నాన్ లేఅవుట్లపై విచారణకు డిమాండ్

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలో నాన్ లేఅవుట్లపై విజిలెన్స్ లేదా అనిశాతో విచారణ చేయించాలని పాలక, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు ముక్త కంఠంతో నినదించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షత వహించారు. అనధికార లేఅవుట్లపై వాడీవేడిగా చర్చ సాగింది. కౌన్సిలర్ అయినాల రమణమూర్తి మాట్లాడుతూ.. ఓ వ్యక్తి సర్వే నంబరు 359లో వేసిన రెండు లేఅవుట్లలో 14 శాతం పన్ను విధించి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులిచ్చే ముసుగులో రూ.2 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కౌన్సిల్ ఆమోదానికి అజెండాలో 27వ అంశంగా చేర్చడమే నిదర్శనమన్నారు. ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలు, పురపాలక సంఘాన్ని మోసం చేశారని కౌన్సిలర్లు సురేష్, మాధవ్ తదితరులు ఆరోపించారు. ఈ లేఅవుట్లకు అనుమతులు ఇవ్వొద్దని ఏకగ్రీవంగా తీర్మానించారు. కమిషనర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ... తాను బాధ్యతలు స్వీకరించక ముందే డీటీసీపీ అనుమతులకు పంపారన్నారు. ఛైర్‌పర్సన్ ఆదేశానుసారమే అజెండాలో చేర్చామని, ఇందులో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు.



ఛైర్‌పర్సన్ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

పారిజాతగిరిలో పవిత్రోత్సవాల సమాప్తం



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు సోమవారంతో సమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణాన్ని రమణీయంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహా పూర్ణాహుతి చేపట్టారు. యాగశాలలో వేదోక్తంగా హోమాలు చేశారు.

రోడ్డెక్కిన కాల్‌మనీ బాధితులు

వడ్డీ వ్యాపారులు వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: సంవత్సరాల తరబడి అధిక వడ్డీలు కట్టలేక మరోపక్క వడ్డీ వ్యాపారుల మానసిక, లైంగిక వేధింపులు తట్టుకోలేక పలువురు కాల్‌మనీ బాధితులు రోడ్డెక్కారు. సోమవారం నగరంలోని ఎస్పీ కార్యాలయానికి ప్రదర్శనగా వచ్చి ఫిర్యాదులు అందజేసి న్యాయం చేయాలని విన్నవించారు. బాధితులకు బాసటగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఎస్పీ కార్యాలయానికి వచ్చి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కరోనా సమయంలో రూ.50 వేలు తీసుకున్నామని.. ఇప్పటికి రూ.10 లక్షలు కట్టామని అయినా అప్పు తీరలేదని అంటున్నారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఓ వ్యాపారి వడ్డీ కోసం ఇంటికొచ్చి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని మరో మహిళ ఆరోపించింది. మరొకరు మాట్లాడుతూ అప్పుగా రూ.25 వేలు తీసుకుంటే ఇప్పటివరకు రూ.5 లక్షల వడ్డీ చెల్లించామని, ఇంకా కట్టాలని వేధిస్తున్నారన్నారు. ఇంకో మహిళ మాట్లాడుతూ అప్పు తీర్చాలని.. వడ్డీ కట్టాలని ఇంటికి వస్తున్నారని, చేతులు తాకుతున్నారన్నారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ఎస్పీ కార్యాలయం వద్దకు వచ్చిన బాధితులు

చక్రాలపై అంతరిక్షం

ఏలూరు విద్యా విభాగం, నగరం, న్యూస్‌టుడే: నేటి ఆధునిక సమాజ ఆవిర్భావం వెనుక శాస్త్రీయ విజ్ఞానం దాగుంది. శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి సాంకేతికతకు దర్పం పట్టేలా కొత్త విషయాలు కనుగొంటారు. అటువంటి ప్రయోగాలకు వేదికైన భారత అంతరిక్ష పరిశోధన సంస్థను (ఇస్రో) సందర్శించే అవకాశం కొందరికే లభిస్తూ ఉంటుంది. ప్రత్యక్షంగా సందర్శించే అవకాశం లేని వారికి సైన్స్ పరిశోధనలు, రాకెట్ల నమూనాలను చూపించాలనే సంకల్పంతో ఇస్రో నిర్వాహకులు ఒక చక్కని అవకాశాన్ని కల్పించారు. వీలైనంత ఎక్కువ మంది చూసేందుకు వీలుగా 'స్పేస్ ఆన్ వీల్స్' పేరిట ప్రత్యేకంగా బస్సును రూపొందించి దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపిస్తున్నారు. ఆ బస్సు సోమవారం ఏలూరులోని సీఆర్ఆర్ పాఠశాలకు వచ్చింది.

ఆకట్టుకుని.. ఆలోచింపజేసి..

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులో 'ఇస్రో'కు సంబంధించిన అనేక సాంకేతిక నమూనాలు ఉన్నాయి. ఇవి విద్యార్థులను ఆలోచింపజేశాయి. తాము భవిష్యత్తులో శాస్త్రవేత్తలం కావాలనే లక్ష్యాన్ని బాలలు ఏర్పరచుకునేలా అవి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఇస్రోలో శాస్త్రవేత్తలు చేసే అంతరిక్ష పరిశోధనలు, రాకెట్ల నమూనాలు ఆకట్టుకున్నాయి.

నమూనాలు ఇవీ

చంద్రయాన్ 1, 2, 3 ప్రయోగాలు, మిషన్, మంగళ్యాన్, ఆదిత్య ఎల్1 మిషన్, శ్రీహరి కోటలోని శాటిలైట్ లాంచ్ ప్యాడ్, ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం, వాతావరణ మార్పులు, తుపాన్లు తదితర ప్రకృతి వైపరీత్యాల గురించి ముందుగానే తెలుసుకునే రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ సిస్టం, టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ, వివిధ ఉపగ్రహాలు. వీటి ప్రత్యేకతల గురించి విద్యార్థులకు వాలంటీర్లు వివరించారు.



ప్రదర్శనాంశాలను తిలకిస్తూ..



బస్సులో అంతరిక్ష సంగతులు



నమూనాలను వీక్షిస్తున్న విద్యార్థులు





3,394 మంది వీక్షణ

జిల్లా విద్యా శాఖాధికారి ఎస్. అబ్రహం ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఏలూరు డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 3,394 మంది విద్యార్థులు అంతరిక్ష మహా యాత్ర బస్సును సందర్శించారు. భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల సమాచారంతో కూడిన 108 చార్టులు ప్రదర్శించారు. విద్యార్థులకు రంగవల్లులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సమగ్ర శిక్షా ఏఎంవో ఆర్. రామారావు, స్పేస్ ఆన్ వీల్స్ జిల్లా సమన్వయకర్త ఎస్. వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానాచార్యురాలు పి. సాయికుమారి పర్యవేక్షించారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం



నగదు చెక్కులు, వస్త్రాలు అందజేస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన ఇద్దరు పేద విద్యార్థినుల చదువు నిమిత్తం ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. చింతలపూడి మండలం రాఘవాపురానికి చెందిన పసుపులేటి పుల్లారావు, కృష్ణవేణి దంపతుల కుమార్తెలు భువనేశ్వరి, గీతాంజలి చదువులో రాణిస్తున్నారు. కానీ పేదరికం కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కానుమెల్లి శశిశేఖరరావుకు విషయం చెప్పడంతో ఆయన సంస్థ ఆధ్వర్యంలో భువనేశ్వరికి రూ.15 వేలు, గీతాంజలికి రూ. 10 వేలు సమకూర్చారు. ఆ మొత్తాన్ని, నెలకు సరిపడా నిత్యావసరాలు, నూతన వస్త్రాలను సోమవారం ఎస్పీ కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో ఎస్పీ విద్యార్థినులకు అందజేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కానుమెల్లి శశిశేఖరరావు, సభ్యులు పాల్గొన్నారు.

సీబీఐ అధికారులమని బెదిరిస్తే భయపడొద్దు.. ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ముంబయి, దిల్లీ, కోల్‌కతా నుంచి మాట్లాడుతున్నామని సీబీఐ అధికారులమని.. మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని కేసులు నమోదు చేస్తామని ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే భయపడవద్దని ఎస్పీ అన్నారు. అలా బెదిరించి డబ్బు గుంజాలని సైబర్ నేరగాళ్లు వల వేస్తారన్నారు. ఇలాంటి కేసులు జిల్లాలో నమోదు అవుతున్నాయన్నారు. ఎవరికైనా అలాంటి ఫోన్ కాల్స్ వస్తే 1930, సైబర్ సెల్ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 54 ఫిర్యాదులొచ్చాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో భోజన సదుపాయం కల్పించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కానుమెల్లి శశిశేఖరరావు భోజన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యవసాయాధికారి ఫిర్యాదుపై కేసు

పోలవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్దతు కంటే అదనంగా మరికొంత సొమ్ము చెల్లిస్తామని రైతుల నుంచి ధాన్యం సేకరించి మోసం చేసిన వ్యక్తులపై వ్యవసాయాధికారి కె.రాంబాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పవన్‌కుమార్ కథనం మేరకు... పోలవరం, పట్టిసీమలకు చెందిన సుమారు పది మంది రైతుల నుంచి పట్టిసీమకు చెందిన మాదేపల్లి యోగేశ్వరరావు, అతడి మనవడు చిలక యోగి గతేడాది జనవరి 7న రూ.14.50 లక్షల విలువ చేసే 958 బస్తాలు(75 కిలోలు) ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బాధిత రైతుల తరపున వ్యవసాయాధికారి ఫిర్యాదు చేయగా... ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జలవనరుల శాఖలో పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్న లస్కర్లకు వేతన బకాయిలు చెల్లించాలని ఏపీఎన్‌జీవో సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ కోరారు. విజయవాడలోని సీఏడీఏ కార్యాలయంలో సోమవారం ఈఈ కె.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. త్వరలో వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : ఎమ్మెల్యే

ఎస్సై కుర్చీలో కూర్చొని పోలీసులకు సూచనలివ్వడంపై విమర్శలు



కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందేలా పోలీసులు కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. తడికలపూడి పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం సందర్శించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పలువురు బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని పోలీసులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ సందర్శన నేపథ్యంలో ఎమ్మెల్యే...ఎస్సై గదిలో ఆయన కుర్చీలో కూర్చోవడం చర్చనీయాంశమైంది. బాధితులు కూర్చొన్న వరుసలోని మరో కుర్చీలో ఎస్సై చెన్నారావు కూర్చొని ఎమ్మెల్యే మాటలు ఆలకిస్తున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

వరద బాధితులకు ఆర్థిక చేయూత



ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు చెక్కు ఇస్తున్న లింగపాలెం నాయకులు

లింగపాలెం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తెదేపా లింగపాలెం మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో నాయకులు రూ.3 లక్షలు విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు చెక్కు రూపంలో అందజేశారు. నాయకులు ఎం.మల్లికార్జునరావు, బొంతు శ్రీను, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

మొక్కవోని దీక్ష.. సత్ఫలితాల దక్షత..!



డ్రాగన్ తోట

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే

ఉద్యోగ విరమణ అనంతరం వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారు కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం గ్రామానికి చెందిన రైతు పోతన శేషగిరిరావు. ఎనభై పదుల వయస్సులోనూ లాభాలు పండిస్తూ.. తోటి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శేషగిరిరావుది వ్యవసాయ కుటుంబం. ఇరిగేషన్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసి 1999లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం స్వగ్రామానికి వచ్చేసిన ఆయన తనకున్న సుమారు 15 ఎకరాల పొలంలో ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో వంటి తోటలు వేసి, ఇరవై ఏళ్లుగా సాగుచేస్తున్నారు. సాగు సమయంలో పొలం మధ్యలో నుంచి హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లడంతో కొన్ని ఆయిల్‌పామ్, కొబ్బరి చెట్లను తొలగించాల్సి వచ్చింది. అనంతరం వాటి స్థానంలో కొత్త రకం పంటలను సాగు చేయాలని ఆలోచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా డ్రాగన్ ఫ్రూట్ గురించి తెలుసుకున్నారు. 2021లో కోల్‌కతా నుంచి ఒక్కో మొక్క రూ.60 చొప్పున ఆరు వేల మొక్కలు తెప్పించి మూడెకరాల విస్తీర్ణంలో నాటారు. రెండేళ్ల నుంచి పంట కాపునకు రాగా ఎకరాకు టన్ను ఫలసాయం అందుతోంది. కిలో రూ.100 నుంచి 150 కి అమ్ముతున్నారు. ఎకరాకు స్తంభాలు, గట్లు, డ్రిప్, మొక్కలు తదితరాలకు రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చు అవుతుంది. దీర్ఘకాలిక పంట కావడంతో ప్రారంభ సమయంలోనే పెట్టుబడి అవుతుందని, అనంతరం నిర్వహణ, కూలీల ఖర్చులు తప్ప పెద్ద వ్యయం ఉండదని రైతు చెబుతున్నారు. అయితే వయస్సు మీద పడటంతో కొద్ది నెలలుగా డ్రాగన్ సాగులో తన అల్లుడు సత్యజానకీరాం సాయం తీసుకుని ముందుకు సాగుతున్నారు. వాడాల్సిన ఎరువులు, తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై నిరంతరం వారికి అవగాహన కల్పిస్తూ బయ్యనగూడెంలో పదెకరాలు, కేతవరం గ్రామంలో మూడెకరాల్లో ప్రస్తుతం ఆయన సాగు చేస్తున్నారు. వీటితో పాటు గతంలో బొబ్బాయి, పుచ్చకాయ, క్యారెట్, ఇతర పంటలను సైతం సాగుచేసి సత్ఫలితాలు సాధించారు.

సేంద్రియ పద్ధతుల్లో...



'వ్యవసాయం అంటే ఇష్టంతోనే ఉద్యోగం విరమణ అనంతరం పొలం బాట పట్టాను. రకరకాల పంటలను సాగు చేశా. అన్నింటిలోనూ మంచి లాభాలే వచ్చాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను మొదటి సారిగా ఈ ప్రాంతానికి తీసుకొచ్చా. దీనిని సేంద్రియ పద్ధతుల్లో పెంచుతున్నాం. పశువుల ఎరువు, జీవామృతం, ఇతర సేంద్రియ పోషకాలను ఎరువుగా అందిస్తున్నాం. ఎకరాకు ఖర్చులు పోనూ రూ.40 నుంచి 50 వేలు ఆదాయం వస్తుంది' అని పోతన శేషగిరిరావు తెలిపారు.

రైతేరాజు

మీరూ అడగొచ్చు

ప్రశ్న: బెండలో కాయ తొలుచు పురుగును ఎలా అరికట్టాలి ?

- రాజారావు, టి.నరసాపురం

సమాధానం: కాయ తొలుచు పురుగు విత్తిన 30 రోజుల నుంచి కోత దశ వరకు ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, పూత, కాత దశలో కాయలను తొలిచి నష్టం కలిగిస్తోంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను ఒక అంగుళం కిందకి తుంచి నాశనం చేయాలి. లీటరు నీటికి క్వినాల్‌ఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి. పంట కాపునకు రాని దశల్లో థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం

చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

ఎండాకు తెగులు ఆశిస్తే దిగుబడిపై ప్రభావం



తెగులుతో ఎండిపోయిన వరి పంట

మార్టేరు, న్యూస్‌టుడే: సార్వా వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు సమస్యాత్మకమైంది. వాతావరణ మార్పుల కారణంగా ప్రస్తుతం అధిక విస్తీర్ణంలో సాగైన ఎంటీయూ 1318, పీఆర్ 126 వరి రకాల్లో ఈ తెగులు కనిపిస్తుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సీనియర్ శాస్త్రవేత్త వి. భువనేశ్వరి తెలిపారు. ప్రస్తుతం పిలక దశ నుంచి అంకురం దశ వరకు ఉన్న పొలాలను పరిశీలించగా ఈ తెగులు గుర్తించడం జరిగింది. పంటను ఈ తెగులు ఆశిస్తే ఆకులు ఎండిపోవడం, గింజలు తాలుగా మారి దిగుబడి తగ్గిపోతుంది. సాగునీటి ప్రవాహం, గాలితో కూడిన వర్షంతో ఈ తెగులు ఇతర పొలాలకు వ్యాపిస్తుంది. తెగులు గుర్తించిన వెంటనే నత్రజని ఎరువును వేయడం ఆపి దఫా దఫాలుగా కొద్ది మోతాదు వేసుకోవాలి. పొలంలో ఉన్న నీటిని తీసి కొత్త నీటిని పెట్టుకోవాలి. తీవ్రత మరీ ఎక్కువగా ఉన్నప్పుడు ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, లేదంటే టెట్రా సైక్లిన్ హైడ్రోక్లోరైడ్ 1.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అవసరం మేరకు 15 రోజుల వ్యవధిలో రెండోసారి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

ఆక్వా సాగులో నీటి నాణ్యత తప్పనిసరి



నరసాపురం, న్యూస్‌టుడే: ఆక్వా సాగు చేసే చెరువుల్లో నీటి నాణ్యత లోపిస్తే మత్స్య సంపద మృత్యువాత పడుతుందని ఆక్వారంగ నిపుణుడు డాక్టర్ అడబాల గోపాలరావు తెలిపారు. ఆక్వా సాగులో అత్యధికంగా మురుగు కాలువలు, ఉప్పుటేరుల నీటిని వినియోగించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఆక్వా చెరువుల్లో నీటిని శుద్ధి చేయకుండా నేరుగా కాలువల్లోకి వదలడంతో అవి కలుషితమవుతున్నాయి. వాటిలోని నీటినే నేరుగా రొయ్యలు, చేపల చెరువుల్లోకి నింపడంతో వాటికి వ్యాధులు సోకి నష్టపోవాల్సి వస్తోంది. పలువురు రైతులు వ్యాధుల భయంతో కాలువల్లో నీటిని నెలల తరబడి చెరువుల్లోకి తోడటం లేదు. దీంతో వాటిల్లోని మత్స్య సంపదకు ఆక్సిజన్ సక్రమంగా అందక ఎదుగుదల లోపించడం, చనిపోవడం చోటుచేసుకుంటాయి. ఆక్వా చెరువుల్లోకి నీటిని తోడుకునేందుకు వీలుగా ఒక చెరువును కేటాయించాలి. అందులో నీటిని శుద్ధిచేసి వాటిని సాగు చెరువుల్లోకి నింపాలి. వినియోగించిన నీటిని శుద్ధిచేసిన అనంతరం బయటకు వదలాలి. వ్యాధులతో మృతిచెందిన చేపలు, రొయ్యలను కాలువల్లోకి వేయకుండా గొయ్యి తీసి పూడ్చాలి. ఆక్వాచెరువుల నీటిలో అమ్మోనియా, నైట్రైట్, హెచ్ టుఎస్ వంటి విషవాయువులు నిర్ధారణకు తరచూ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలని గోపాలరావు రైతులకు సూచించారు.

విద్యార్థులకు పోటీలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యా, వైద్య, ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సుబ్బమ్మదేవి పాఠశాలలో విద్యార్థులకు సోమవారం జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు అక్టోబరు 11న బహుమతులు అందజేస్తారు. పోటీలకు నోడల్ అధికారులుగా ఏలూరు ఎంఈవో-2 రంగయ్య, ఎస్. లక్ష్మణకుమార్ వ్యవహరించారు. ఏలూరు డీవైఈవో రవిప్రకాశ్, ఏఎల్ఎస్ సమన్వయకర్త రాధాకృష్ణ పర్యవేక్షించారు.

న్యాయ విచారణ జరపాలని ధర్నా



వీహెచ్‌పీ, భాజపా నాయకుల ప్రదర్శన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతపై న్యాయ విచారణ జరపాలని విశ్వ హిందూ పరిషత్ నాయకులు కోరారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ ఆలయాల నిర్వహణ బాధ్యతలను హిందువులకే అప్పగించాలన్నారు. హిందూ దేవాలయాల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నిబద్ధతతో పనిచేసే వారికి గుర్తింపు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిబద్ధతతో పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. ఏలూరు, నూజివీడు ఆర్డీవోలుగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఖాజావలి, భవానీ శంకరిల వీడ్కోలు కార్యక్రమం సోమవారం కలెక్టరేట్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కాలంలో ఆర్డీవోలు బాగా పనిచేశారని ప్రశంసించారు.

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. అరబిందో ఫార్మా, అపోలో ఫార్మాసీస్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి 159 మంది నిరుద్యోగులు హాజరు కాగా.. 11 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు.

స్థల వివాదంతో రహదారికి కంచె

చాట్రాయి, న్యూస్‌టుడే: స్థల వివాద నేపథ్యంలో రహదారిపై రాకపోకలను నియంత్రిస్తూ మూడు కుటుంబాలను కొందరు ఇబ్బంది పెడుతున్నారని కోటపాడు గ్రామానికి చెందిన చీపు దుర్గారావు, నాగరాజు, వెంకటేశ్వరరావులు వాపోతున్నారు. వారి కథనం ప్రకారం.. బాధితులకు ఇరుగు పొరుగు కుటుంబాలైన వేముల నాగేశ్వరరావు, శివకృష్ణ, దుర్గారావు కుటుంబాలతో స్థల వివాదాలున్నాయి. ఇటీవల మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాల మధ్యలో ఉన్న రహదారిపై వేముల నాగేశ్వరరావు, శివకృష్ణ, దుర్గారావు కంచె ఏర్పాటు చేశారు. దీంతో బాధిత కుటుంబాల వారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గడిచిన 50 ఏళ్లుగా తమ కుటుంబాలు అదే దారిలో నడుస్తున్నామని, ఇప్పుడు మీకు దారి లేదంటూ తమను ఇబ్బంది పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

గోదావరికి తగ్గిన వరద

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరికి వరద తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద సోమవారం ఉదయం 28.87 మీటర్లకు పెరిగిన వరద... సాయంత్రానికి 28.80 మీటర్లకు తగ్గింది. 48 గేట్ల ద్వారా 2.97 లక్షల క్యూసెక్కులను దిగువకు వెళ్తున్నట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆక్వా రైతు మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఆక్వా రైతు మృతి చెందిన ఘటన ఇది. బొమ్మినంపాడు శివారు జానకీగూడేనికి చెందిన బి.సత్యనారాయణరాజు (60) దేవపూడి సరిహద్దులో రొయ్యల సాగు చేస్తున్నారు. సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణరాజుకు కుడి చెయ్యి లేదు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. గతంలో ఆయన కుమారుడు సందీప్ ఇదే విధంగా చెరువు వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందడం గమనార్హం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నగరంలో అర్ధరాత్రి అలజడి


* రెండు వర్గాల ఘర్షణ
* కత్తులతో ఒకరిపై దాడి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలో ఆదివారం అర్ధరాత్రి కొందరు కత్తులతో ఓ వ్యక్తిపై దాడి చేశారు. సుత్తి లాంటి వస్తువుతో తల పగులకొట్టారు. తీవ్ర గాయాల పాలైన అతన్ని స్థానికులు సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. గంగానమ్మ జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ దాడికి దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగెళ్లమూడి శివారు జంగారెడ్డిగూడెం మార్గంలోని ఎంఆర్‌సీ కాలనీ వద్ద ఆదివారం రాత్రి జాతర నిర్వహించారు. అక్కడ రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. జాతర ముగిసిన అనంతరం ఇళ్లకు వెళ్లే సమయంలో ఇరువర్గాల వారు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన మానుకొండ గంగాధరరావుపై ప్రత్యర్థి వర్గానికి చెందిన సాయి, రామయ్య, సురేష్, సత్తెమ్మ మనవడు, మల్లెపూలు అనే అయిదుగురు దాడి చేశారు. కత్తులతో తల, మెడ, ఛాతిపై నరికారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

బాలుడి మృతదేహం గుర్తింపు



పోలినాయుడు (పాతచిత్రం)

కైకలూరు, న్యూస్‌టుడే: సోదరి పుట్టిన రోజు వేడుకలకు కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి వచ్చి కొల్లేరులో దూకి గల్లంతైన ఏలూరుకు చెందిన బాలుడు పోలి నాయుడు (16) మృతదేహం లభ్యమైంది. ఆదివారం అర్ధరాత్రి వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తెదేపా వడ్డి సాధికారక రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు కొల్లేరు నీటి ప్రవాహానికి అడ్డుగా మత్స్యకారులతో వలలు కట్టించారు. దీంతో నీట మునిగిన బాలుడు పందిరిపల్లెగూడెం- కొట్టాడ గ్రామ సరిహద్దు ప్రాంతంలోని పేరంటాళ్ల కనుమ వద్ద వలలో చిక్కుకున్నాడు. గ్రామీణ ఠాణా ఎస్సై వి.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడిని విగతజీవిగా చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు : 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: కొత్తూరు రాజీవ్ గృహకల్ప కాలనీ ఏడో రోడ్డులోని కాలువలో మురుగు పేరుకుపోయింది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- ఎస్.సత్తిబాబు, ఏడో రోడ్డు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగర పాలక సహాయాధికారి**

సమస్య: సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీలోని రెండో రోడ్డులో వీధి దీపం వారం రోజులుగా వెలగడం లేదు. **- ఎ.నాగరాజు, హౌసింగ్‌బోర్డు కాలనీ**

సమాధానం: సిబ్బందితో వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: ఏలూరు పోణంగి రోడ్డు వైఎస్ఆర్ కాలనీ ఆరో రోడ్డులోని కాలువలో పూడిక తీయడం లేదు. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- వి.శ్రీనివాసరావు, వైఎస్ఆర్ కాలనీ**

సమాధానం: సిబ్బందితో మురుగు కాలువలో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగర పాలక అధికారి**

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి.. **ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** శనివారపుపేట జడ్పీ హైస్కూలు ఎదురు రోడ్డులో వీధి దీపాలను వెలిగించారు. ఈ సమస్యపై గత నెల 30న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

నగరంలో ఈనాడు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉదయం 8.30 గంటలకు: స్వచ్ఛతాహీ సేవలో భాగంగా జిల్లా యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో జూట్ మిల్లు అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి మినీ బైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపం వరకు సైకిల్ ర్యాలీ.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.ఎం.అంబేడ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలు దుగ్గు, కవ్వకుంట, దిబ్బగూడెం, సూర్యారావుపేట, లక్ష్మీపురం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు. వ్యవసాయ బోర్లకు మంగళవారం తెల్లవారుజామున 2 నుంచి ఉదయం 7 గంటల వరకు, తిరిగి రాత్రి 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉంటుందని వివరించారు.

మీనంలా దూసుకెళ్తున్నారు!

పేదింటి బిడ్డలు.. జల క్రీడల్లో దిట్టలు

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే

వారంతా పేద కుటుంబాలకు చెందిన పిల్లలు. వారు విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో ఈత కొలను లేదు. స్థానిక కాలువలో ఈత సాధన చేశారు. వీరి ఆసక్తిని గమనించిన వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరిసేలా తీర్చిదిద్దుతున్నారు. కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు బిశ్వనాథ భర్తియా కొలనులో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో పలు విభాగాల్లో ప్రథమస్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు పాపాయమ్మ, నాగసుధలు విద్యార్థులు సత్తా చాటారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని హెచ్ఎం ప్రసాదరావు చెబుతుంటారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతా



నా తల్లిదండ్రులు గణపతి, అనిత రోజు వారీ కూలీలు. కష్టపడి నన్ను చదివిస్తున్నారు. వరుసగా రెండో ఏడాది 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. గతేడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో సెకన్ల తేడాతో వెనుకంజ వేశా. ఈసారి సత్తా చాటుతా. కబడ్డీ పోటీల్లో జిల్లా స్థాయిలో ఆడా. పోలీసు శాఖలో కొలువు సాధించాలన్నదే నా లక్ష్యం.
- రాగోలు భరత్, పదో తరగతి

జాతీయ స్థాయిలో రాణిస్తా



200 మీటర్ల ఫ్రీస్టైల్ ఈత పోటీలో ప్రథమ స్థానం సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. గతేడాది జిల్లా స్థాయి పోటీలకే పరిమితమయ్యా. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నా తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకొస్తా.
- సుంకర సత్య, ఎనిమిదో తరగతి

ఆర్మీలో కొలువే లక్ష్యం



ఏలూరు కాలువలో ఈత నేర్చుకున్నా. గతేడాది 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఈత పోటీల్లో జిల్లాలో ద్వితీయ స్థానం. కొద్దిపాటి తేడాతో రాష్ట్రస్థాయికి వెళ్లలేకపోయా. ఈసారి 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ఈత పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. ఆర్మీలో కొలువు సాధించి దేశ సేవ చేయాలన్నదే నా లక్ష్యం.
- చిగురుపల్లి సాయి, పదో తరగతి

పోలీసునవుతా



నా తల్లిదండ్రులు పాపారావు, రామలక్ష్మి ఇద్దరూ వ్యవసాయ కూలీలే. 200 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో జిల్లా పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. పీఈటీలు పాపాయమ్మ, నాగసుధల ప్రోత్సాహం బాగుంది. గతేడాది రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నా. పోలీసు కావడమే లక్ష్యం.
- పెంట జశ్వంత్, పదో తరగతి



శిక్షణకు హాజరైన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

పెదవేగి, పెదపాడు, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. పెదవేగి, పెదపాడు ఎంపీడీవో కార్యాలయాల్లో మండల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించే వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అర్జీదారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమ నిర్వహణపై సోమవారం అధికారులకు కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు సంబంధించిన సిటిజన్ ఛార్టుల అప్‌లోడ్, ఫైనాన్స్‌కు సంబంధించిన అర్జీలు, కోర్టు కేసులు తదితర అంశాలపై అధికారులు అవగాహన పొందాలన్నారు.

ఈవీఎంల గోదాము పరిశీలన.. **ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కలెక్టరేట్‌లోని ఈవీఎంల గోదామును సోమవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్వో పుష్పమణి తదితరులున్నారు.



నారాయణపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న నాయకులు

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు

భీమడోలు, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ, తిరుమల పవిత్రత కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన, తెదేపా నాయకులు సోమవారం దేవాలయాల్లో పూజలు చేశారు. భీమడోలు కూడలిలోని వేంకటేశ్వరస్వామి రూపక ఆలయంలో ప్రదర్శనగా చేరుకున్న నాయకులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి, ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించారు. నాయకులు ప్రత్తి మదన్, గన్ని నాగేశ్వరావు, దూసనపూడి పుల్లయ్యనాయుడు, కరణం పెద్దిరాజు, నీలం అజయ్, కమ్ము పద్మ, ముప్పిరెడ్డి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా నాలుగు రోజుల పాటు నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా జనసేన నాయకులు మండలంలోని ఆలయాల్లో సోమవారం దీపాలు వెలిగించారు.

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఏలూరులో జనసేన నాయకుడు నారా శేషు నిర్వహిస్తున్న శ్రీనివాస వైభవోత్సవాల్లో సోమవారం విశేష పూజలు చేశారు. ఉదయం సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి, లక్ష్మీగణపతి ఆలయాలను శుద్ధి చేశారు. సాయంత్రం ధర్మభేరి ప్రాంగణంలో సహస్ర దీపాలంకరణ సేవ చేశారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

2న స్వచ్ఛ భారత్ దివస్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశించిన పరిశుభ్రత ఉద్యమం స్వచ్ఛ భారత్ మిషన్ ప్రవేశపెట్టి పదేళ్లు అయిందని, ఈ సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్ ఘనంగా నిర్వహించాలని కోరారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఎస్టీ కులాల వారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ సమన్వయకర్త ఝాన్సీరాణి కోరారు. ఈ మేరకు ఏలూరులో హౌసింగ్ పీడీకి సోమవారం వినతిపత్రం అందజేశారు. పెదపాడు, పెదవేగి మండలాల్లో ఎరుకులు, యానాదులు, చెంచులు జీవిస్తున్నారని.. నివసించేందుకు సరైన గూడు లేక వర్షాలకు, ఎండలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతిగృహ విద్యార్థుల సంక్షేమంపై అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హెచ్చరించారు. దెందులూరు మండలం కొవ్వలిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల వివరాలు, హాజరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాంగణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం, కూరగాయలు నాణ్యతగా లేకపోవడంతో పనితీరు మార్చుకోవాలని వార్డెన్‌ను హెచ్చరించారు. వసతిగృహం వెనుక వైపు మురుగు నిల్వ ఉండటాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ

విద్యార్థుల సంక్షేమంపై అలసత్వం వద్దు



పులిహోరను పరిశీలిస్తున్న ప్రభాకర్

కార్యదర్శిని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి చొరవ చూపాలి.. **దెందులూరు, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యలపై వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించారు. దెందులూరు మండలానికి చెందిన పలువురు వినతులు అందజేయగా వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుమతీ, ఎంపీడీవో శ్రీలత, తెదేపా నాయకుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామరాజును సత్కరిస్తున్న వీరాంజనేయులు

మంతెనకు గన్ని అభినందన

భీమడోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన మంతెన రామరాజు సోమవారం తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులును భీమడోలులోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రామరాజును గన్ని అభినందించి శాలువాతో సత్కరించారు. మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, కరణం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. సంఘం నాయకులు రూజ్‌వెల్ట్, వెంకట రమణారావు తదితరులు సోమవారం డీఈవో ఎస్.అబ్రహంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పురపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న 12 మంది ఉపాధ్యాయులను పని సర్దుబాటు పేరుతో జడ్పీ బడుల్లోకి పంపారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. వేలేరుపాడు మండలం ఎస్ఆర్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులే ఉన్నారని, సబ్జెక్టు ఉపాధ్యాయులు లేనందున విద్యార్థులు తెలంగాణకు వెళ్లిపోతున్నారన్నారు. ఆ పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న బడుల్లో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు.



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎన్‌టీఏ నాయకులు

ఆర్డీవోగా అంబరీశ్ బాధ్యతల స్వీకారం



ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏలూరు ఆర్డీవోగా ఎం.అచ్యుత్ అంబరీశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. తదుపరి జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణిలను కలిశారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సత్య

'సత్య' షోరూమ్ ప్రారంభం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు ఎన్ఆర్ పేటలో నూతనంగా నిర్మించిన సీఎల్ఎన్ ఐకాన్ భవనంలో సోమవారం 'సత్య' ఏజెన్సీస్ వారి 36వ షోరూమ్ ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా భవనం యజమానులు సత్య, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సత్య ఏజెన్సీ రాష్ట్ర హెడ్ సెంథిల్, సీనియర్ డైరెక్టర్ ఆనంద్, ప్రముఖ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హుండీ దొంగ అరెస్టు

గణపవరం, న్యూస్‌టుడే: కేశవరం ఆంజనేయస్వామి గుడిలో హుండీ దొంగతనం చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు. కేశవరానికి చెందిన ముద్దర్తి గణేష్ చెడు వ్యసనాలను బానిసై ఈ నెల 27న గుడిలోని హుండీని అపహరించాడన్నారు. ఆలయ కమిటీ పెద్దల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు.. **ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే:** వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగాయగూడెం నేరెళ్ల రాజాకాలనీకి చెందిన మహిళ ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా.. **ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే:** మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి న్యాయస్థానం రూ.21 వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 22న గూడ్స్ షెడ్డు రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు శ్వాస నిర్ధారణ పరీక్షలు చేశారు. అయిదుగురు ద్విచక్ర వాహనదారులు, ఇద్దరు ఆటో చోదకులు పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఏలూరు మొదటి స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

ప్రమాదం పొంచి ఉంది.. చూసి వెళ్లండి!



వట్లూరు నుంచి భోగాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో వట్లూరు పరిధిలోని రైస్ మిల్లుల సమీపంలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. పెద్దచెరువు నుంచి వచ్చే నీరు పంట పొలాలకు వెళ్లేందుకు రహదారి మధ్యలో తూర ఏర్పాటుచేశారు. అక్కడ గుంత ఏర్పడగా.. స్థానికులు గమనించి ప్రమాదాలు జరగకుండా కర్ర, డబ్బా పెట్టారు. ఈ దారిలో పెదవేగి, పెదపాడు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మధ్యలోని గుంత రాత్రివేళ కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ పెదవేగి ఏఈ బలరాం మాట్లాడుతూ గుంతను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, వట్లూరు (పెదపాడు)**

'మత విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు'

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పెద్దలు సూపర్ 6 పథకాలను అమలు చేయకుండా లడ్డూ ప్రసాదం పేరుతో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం విమర్శించారు. ఏలూరు పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసి ఆమోదించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం కంటితుడుపు చర్యగా ఉందన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే విద్యార్థులు నష్టపోతారన్నారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. ఉచిత ఇసుక, ప్రజా సమస్యలపై అక్టోబరు 4న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ దర్శి సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, లింగరాజు, పి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధులు

నిడమర్రు, న్యూస్‌టుడే: ఉంగుటూరు నియోజకవర్గంలో ర.భ. శాఖ రహదారుల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేశారు. బువ్వనపల్లి- నిడమర్రు వయా అడవికొలను రహదారికి రూ.30 లక్షలు, నల్లజర్ల- లక్ష్మీనగర్ మార్గానికి రూ.50 లక్షలు, భీమడోలు- కామవరపుకోట దారికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. నిడమర్రు నుంచి పత్తేపురం రహదారి అధ్వానంగా మారినా నిధులు మంజూరు చేయకపోవడంపై ఆ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రేపు గాంధీ జయంతి వేడుకలు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలనులో మాజీ మంత్రి, సర్వోదయ నాయకుడు చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు నిర్మించిన గాంధీ భవనంలో అక్టోబరు 2న మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గాంధీ స్మారక నిధి, సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ముఖ్య అతిథులుగా శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు, గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు గాంధీ పీసీ ఖాజా పాల్గొంటారని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధన అందరి బాధ్యత

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన అందరి బాధ్యతని దళిత బహుజన సంఘాల నాయకులు అన్నారు. అంబేడ్కర్ ఏలూరు వచ్చి 80 సంవత్సరాలైన సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ 1944 సెప్టెంబరు 30న ఏలూరు వచ్చారన్నారు. కార్యక్రమంలో సెట్‌వెల్ సీఈవో ప్రభాకరరావు, ఆర్ఐవో చంద్రశేఖరరావు, డి.వెంకటేశ్వర్లు, నేతల రమేశ్‌బాబు, వెంకటేశ్వర్లు, ఎం.ఇస్సాకు, ఎ.అనిల్ తదితరులు పాల్గొన్నారు.
★ నగరంలోని 3వ డివిజన్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా ఎస్సీ విభాగం నాయకుడు బాలాజీ, దళిత నాయకులు జి.ప్రకాశ్, బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు



హాజరైన బాలబాలికలు

నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు నియోజకవర్గ స్థాయి పరుగు, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, హైజంప్, లాంగ్ జంప్, డిస్క్‌త్రో, ట్రిపుల్ జంప్, షటిల్ పోటీలు నిర్వహించారు. శనివారపుపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని పాఠశాలల నుంచి సుమారు 182 మంది బాలబాలికలు హాజయ్యారు. వివిధ క్రీడల నుంచి ముగ్గురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల సమన్వయకర్తలు పి.పద్మలత, ఎన్.లీలాకుమారి, పీడీలు రమేష్, మురళీకృష్ణమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన బాలికలతో పద్మలత, పీడీలు, పీఈటీలు

బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక.. **ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** ఏలూరు ఇండోర్ స్టేడియం మైదానంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో హ్యాండ్‌బాల్ బాలబాలికల ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 470 మంది హాజరయ్యారు. బాలికలు 20, బాలురు 20 మంది చొప్పున ఎంపిక చేశారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అండర్-14, 17 కార్యనిర్వాహకురాలు కె.అలివేలు మంగ, డీఎస్‌డీవో బి.శ్రీనివాసరావు, పీఈటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఐ.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన బాలురతో క్రీడాధికారులు, పీఈటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక.. **గణపవరం, న్యూస్‌టుడే:** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ పోటీల్లో గణపవరం బాలుర ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎం.అఖిల్ శ్రీవర్మ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మూర్తి తెలిపారు. విద్యార్థిని, తర్ఫీదు ఇచ్చిన పీఈటీ పద్మావతిని ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.

4న తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా దర్బార్.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏలూరు అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అక్టోబరు 4న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.వి.శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే బడేటి చంటి ప్రజా దర్బార్ నిర్వహిస్తారని, నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలి.. **ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్కీం వర్కర్లకు కనీసం వేతనం అమలు చేయాలని సీపీఎం శ్రామిక మహిళల మహాసభ డిమాండ్ చేసింది. సీపీఎం మహాసభల్లో భాగంగా శ్రామిక మహిళల మహాసభ ఎం.అరుణకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి పి.కిశోర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో పని చేస్తున్న శ్రామిక మహిళలకు ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నాయన్నారు. స్కీం వర్కర్లకు ఏడో వేతన కమిషన్ సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

లాభాల బాటలో చేబ్రోలు సొసైటీ.. **నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే:** చేబ్రోలు విశాల సహకార సంఘం (సొసైటీ) 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.76.93 లక్షల లాభాలు ఆర్జించిందని పర్సన్ ఇన్‌ఛార్జి కురుచేటి నరసింహమూర్తి తెలిపారు. సొసైటీ మహాజన సభ నారాయణపురంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దస్త్రాల కంప్యూటరీకరణకు జిల్లాలోని చేబ్రోలు, శనివారపుపేట సొసైటీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారని, 22,760 ఖాతాలు ఉండగా 20,811 కంప్యూటరీకరణ చేశామన్నారు. సీఈవో యర్ర శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్వాగతోత్సవం.. **గణపవరం, న్యూస్‌టుడే:** గణపవరం శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్వాగతోత్సవం నిర్వహించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్సవాలకు చింతలపాటి సత్యనారాయణరాజు రూ.20 వేలు, కళాశాల అభివృద్ధికి డి.సత్యనారాయణ రూ.10 వేలు అందజేశారు. ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీను, సర్పంచి అలంకారం, తెదేపా పట్టణాధ్యక్షుడు సురేంద్రకుమార్ రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రతిభ.. **ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ఏలూరులోని సంఘ కార్యాలయంలో జిల్లా స్థాయి సాంస్కృతిక, జానపద తదితర పోటీల్లో ఉంగుటూరు మండల ఉపాధ్యాయులు ప్రతిభ చాటారు. అల్లు శ్రీనివాసరావు (ఉప్పాకపాడు), హరికృష్ణ, బులి వెంకయ్య (ఉంగుటూరు), ఐ.శ్రీనివాసరావు, ఉనుముల రాంబాబులు (నారాయణపురం), వాణి (గొల్లగూడెం), శివకుమార్ (తిమ్మయ్యపాలెం), పద్మ (వెంకటకృష్ణాపురం), రాణి (పత్తేపురం) గెలుపొందారు.

కొబ్బరి రైతులను ఆదుకోవడంలో విఫలం.. **ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని కొబ్బరి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో బత్తిని లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అవి ఇవి అన్నీ



గర్భిణులకు సామూహిక సీమంతాలు.. **భీమడోలు, న్యూస్‌టుడే:** ఐసీడీఎస్ భీమడోలు ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భీమడోలులో పౌష్టికాహారం ఆవశ్యకత, మిషన్ శక్తిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ క్లస్టర్ పర్యవేక్షకురాలు ఎండీ షహనాజ్ బేగం, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం

•పోలవరం • చింతలపూడి

శ్రీవారి ఆలయ మెట్లకు పూజలు


మెట్లు శుభ్రం చేస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ పవిత్రత దెబ్బతిన్న నేపథ్యంలో.. జనసేన నాయకులు ద్వారకాతిరుమల చిన వేంకన్న ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో మెట్లు శుభ్రం చేసి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టారు. అనంతరం కర్పూర దీపాలు వెలిగించి క్షమించమని స్వామివారిని వేడుకున్నారు. చింతల్ కుమారి, మాధవి, సీతారత్నకుమారి, శ్రీనివాసరావు, అంజిబాబు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు వేగవంతం

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి రాష్ట్ర సరిహద్దు నుంచి పోలవరం మీదుగా కొవ్వూరు వరకు 365బీబీ జాతీయ రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే విస్తరణలో నష్టపోతున్న దుకాణాలు, ఇళ్లు, పంట భూములపై సర్వే చేసిన అధికారులు... గ్రామసభలు ఏర్పాటు చేసి తుది నివేదిక తయారు చేశారు. జీలుగుమిల్లి నుంచి రహదారి విస్తరించేందుకు సోమవారం మరోసారి సర్వే నిర్వహించారు. బృందాలుగా ఏర్పడిన ఎన్‌హెచ్ సిబ్బంది పలుచోట్ల ఏకకాలంలో సర్వే చేసి గుర్తులు ఏర్పాటు చేశారు. ఈ రహదారి విస్తరణతో హైదరాబాద్- విశాఖపట్నం మధ్య ప్రయాణ దూరం తగ్గనుంది.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి సీహెచ్ మధుబాబు

లింగపాలెం, న్యూస్‌టుడే: వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల లీగల్ సర్వీసు కమిటీ ఛైర్మన్, చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సీహెచ్ మధుబాబు ఆదేశించారు. లింగపాలెం, ధర్మాజీగూడెంలోని బాలుర, బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దస్త్రాలు, వసతులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సిబ్బంది పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ధర్మాజీగూడెం బాలికల వసతి గృహంలో తాగునీరు సౌకర్యం, మరుగుదొడ్లు, అదనపు గదులు నిర్మించాలని పలువురు విజ్ఞప్తి చేయగా- అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. లీగల్ సర్వీసు కమిటీ సభ్యుడు అక్బర్‌అలీ, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరి రైతులను ఆదుకోవడంలో విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కొబ్బరి రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో సంఘ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కో-కన్వీనర్ బత్తిని లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ... కొబ్బరి ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందన్నారు. అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొబ్బరి విస్తీర్ణం అధికంగా ఉందన్నారు. తెల్లదోమ, ఎర్రనల్లి తదితర తెగుళ్లతో దిగుబడి తగ్గిపోతోందన్నారు. విదేశీ కొబ్బరి దిగుమతులతో రైతులకు కనీస ధర రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొబ్బరి బోర్డు ద్వారా రైతులకు మొక్కలు, ఎరువులు, యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందించాలని ఆయన కోరారు.

ఎంపీటీసీ సభ్యుడి హఠాన్మరణం


రాజేంద్రప్రసాద్‌రెడ్డి (పాత చిత్రం)

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వల్లంపట్ల ఎంపీటీసీ సభ్యుడు గాదె రాజేంద్రప్రసాద్ రెడ్డి(58) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన వల్లంపట్ల మాజీ సర్పంచిగానూ సేవలందించారు. గతంలో మల్లుకుంట సహకార సంఘం డైరెక్టర్‌గా సేవలందించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

భవనాలు శిథిలమై... రక్షణ గగనమై!

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

నియోజకవర్గ కేంద్రం చింతలపూడిలోని ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షాలకే భవనాలు ఉరుస్తున్నాయి. కొన్నిచోట్ల పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. పాత భవనాల్లో విధులు నిర్వర్తించేందుకు అధికారులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన శాఖ, మెప్మా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈ కార్యాలయాల భవనం వర్షాలకు ముద్దయి... ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. భవన ప్రాంగణమంతా చిట్టడవిని తలపిస్తోంది. ఓ మోస్తరు వర్షానికే ప్రాంగణంలో నీరు నిలిచిపోయి... కార్యాలయాల లోపలికి వెళ్లలేని దుస్థితి.


వర్షాలకు చెమ్మగిల్లిన ఉద్యాన కార్యాలయ భవన గోడలు

చింతలపూడి మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలోని పాత భవనంలో కొన్ని గదులు ఈవోపీఆర్డీ, మత్స్యశాఖ కార్యాలయాలకు కేటాయించారు. ఈ పురాతన భవనం శిథిలావస్థకు చేరింది. పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.





చింతలపూడి మహిళా సమాఖ్య భవనం చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. ఈ భవనంలోనే గ్రామ సచివాలయం సైతం నడుస్తోంది. వర్షాలకు నీరు లీకై... దస్త్రాలు తడిసిపోతున్నాయి. పైకప్పు సైతం పెచ్చులూడి పడుతుండటంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

● వర్షాలకు ఉరుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు ● పెచ్చులూడుతున్న పైకప్పు.. బిక్కుబిక్కుమంటున్న ఉద్యోగులు

ఆసుపత్రిలోనూ అవస్థలు

పేదలకు వైద్య సేవలందించే ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు సైతం వర్షానికి లీకవుతున్నాయి. ఆయా వార్డుల్లో మంచాలు తొలగించాల్సిన దయనీయత ఏర్పడుతోంది. అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు చేసే గదుల్లోనే పైకప్పు ఉరుస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు ఉపకేంద్ర కార్యాలయ భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. లోపల కూర్చోడానికి సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే వినియోగదారులూ భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల భవనాలను బాగు చేయాలని, శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

నగర పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని దెబ్బతిన్న ప్రభుత్వ కార్యాలయాలకు మరమ్మతులు చేయిస్తాం. కొన్నింటిని నూతన భవనాలు అవసరం. వాటిని గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తాం. సమస్యలు పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందించేలా చర్యలు తీసుకుంటాం.
- మురళీకృష్ణ, ఎంపీడీవో, చింతలపూడి

కమిషనర్ బాధ్యతల స్వీకరణ


పావని

చింతలపూడి, న్యూస్‌టుడే: నగర పంచాయతీ కమిషనర్‌గా డి.పావని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం పట్టణాభివృద్ధి సంస్థ పరిపాలనాధికారిగా పని చేస్తూ... బదిలీపై ఇక్కడికొచ్చారు. బాధ్యతల స్వీకరణానంతరం ఆమె మాట్లాడుతూ... నగర పంచాయతీని అభివృద్ధి బాట పట్టించడానికి కృషి చేస్తానన్నారు. పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలని కార్మిక యూనియన్, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ పావనిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ నాయకుడు బాబు మాట్లాడుతూ... చింతలపూడిని నగర పంచాయతీగా అభివృద్ధి చేసి నాలుగేళ్లు దాటిందన్నారు. తదనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులకు సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

రోగులతో సఖ్యతగా మెలగాలి


రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

లింగపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రులకొచ్చే రోగులతో వైద్య సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సూచించారు. స్థానిక ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పని తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రులకు పేదలు ఎక్కువగా వస్తుంటారని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

చలో కాకినాడను జయప్రదం చేద్దాం


గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న మహాసేన రాజేశ్ తదితరులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా చలో కాకినాడ కార్యక్రమానికి మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని మహాసేన రాజేశ్ పిలుపునిచ్చారు. కొమ్మరలో చలో కాకినాడ గోడపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని 50 లక్షల మంది మాలలు ఏం కోరుకుంటున్నారో కేంద్రానికి తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు. మాలలు ఐక్యంగా ముందుకు సాగుతూ తమ హక్కులు కాపాడుకోవాలని కోరారు. అనంతరం ఆయన్ను పలువురు సత్కరించారు.

మరుగుదొడ్ల నిర్మాణాలకు వినతి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఐ నాయకుడు వసంతరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... పట్టణంలో తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పట్టణం రద్దీగా మారుతోందని, సమస్య పరిష్కారానికి చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. నాయకులు బాబు, గురవయ్య, రామిరెడ్డి, జానీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం: స్థానిక ఏటిగట్టు కూడలిలోని బస్టాండులో మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకట్రావు, భూచంద్రం, సాయికృష్ణ, పోసిరత్నం పాల్గొన్నారు.

అమ్మవారి దేవాలయాల ముస్తాబు

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని అమ్మవారి ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. పోలవరం, పట్టిసీమ, బంగారమ్మపేట, కొత్త పట్టిసీమ, గూటాల, ప్రగడపల్లి, ఎల్ఎన్డీపేట, రేపల్లెవాడ, బంగారమ్మపేట, నూతనగూడెం, పాతపోలవరం ఆలయాలను వివిధ రంగులతో తీర్చిదిద్ది... విద్యుద్దీపాలతో అలంకరించారు.

గిరిజన సంక్షేమ శాఖ ఈఈ బదిలీ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ కేఆర్‌పురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కుమార్ పార్వతీపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. బుట్టాయగూడెం డీఈ ఎస్.జొనాథన్ విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంపచోడవరం డీఈ డేవిడ్‌రాజు ఇక్కడికొచ్చారు. బుట్టాయగూడెం ఏఈ లక్ష్మణరావు చింతూరు బదిలీ కాగా, ఆయన స్థానంలో షాహీనా విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

తిమ్మాపురం బాలికల ప్రతిభ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఇటీవల గణపవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ అండర్-17 బాలికల విభాగంలో తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థినులు పొనుకుమాటి భవ్య, శ్రీగిరి రాధిక విశేషంగా రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యనారాయణ, పీడీ గుడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు నల్లపూసల గొలుసును దుండగుడు లాక్కెళ్లిన ఘటన పట్టణంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... వేగవరానికి చెందిన మాదాసు సిద్ధాయమ్మ రెండో కుమార్తె పట్టణంలో నివసిస్తున్నారు. ఆమెను చూసేందుకు మూడో కుమార్తెతో కలిసి జంగారెడ్డిగూడెం వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని యువకుడు సిద్ధాయమ్మ మెడలోని పుస్తెల తాడు లాగబోయాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో... బంగారు నల్లపూసల గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ క్రమంలో ఆమె కింద పడిపోయి స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణబాబు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.


నిర్వాసితులను విచారిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

భూ వివాదం.. కేసు నమోదు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: పి.అంకంపాలెం రెవెన్యూ పరిధిలో కొరుటూరు నిర్వాసితులకిచ్చిన ఆర్‌అండ్‌ఆర్ భూమిలో పరికరాలు, మొక్కలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. వివాదాస్పద భూమిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఎస్సై మాట్లాడుతూ... నిర్వాసితుల భూముల్లోకి అక్రమంగా చొరబడిన గిరిజనులు, వారిని రెచ్చగొట్టిన ఓ నాయకుడిపై కేసు నమోదు చేశామన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ముగ్గురు దొంగల అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ సామగ్రిని చోరీ చేసి ఆటోలో తరలిస్తుండగా.. పట్టణ శివారు బాటగంగానమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

అత్యాచారాలను అరికట్టాలి

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జ్యోతిరావుపులే సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి 152 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో... సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన కన్నాపురంలో సోమవారం సభ నిర్వహించారు. నాయకులు రాఘవ, రామ్మోహన్, బాబూరావు, లత, లక్ష్మి పాల్గొన్నారు.

కళ్లకు గంతలు... కనిపించని గుంతలు!


కొయ్యలగూడెం - అంకాలగూడెం మార్గంలో అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణం


దిప్పకాయలపాడు మార్గంలో ఇలా...


పరింపూడి సమీపంలో గోతులమయంగా రహదారి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గోతులమయంగా మారాయి. తటాకాలను తలపిస్తున్న రోడ్లలో ప్రయాణమంటేనే వాహనదారులు, ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, కొయ్యలగూడెం**


పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, లబ్ధిదారులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: చిన్నారులు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో తులసి అన్నారు. అంకాలగూడెంలో పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. సెక్టారు పర్యవేక్షకురాలు నయోమిరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రుణాలు తిరిగి చెల్లించాలని ఆందోళన

కుక్కునూరు, న్యూస్‌టుడే: రైతులు నుంచి రెండు దఫాలు రికవరీ చేసిన రుణాలను తిరిగి చెల్లించాలని ఇబ్రహీంపేట రైతులు డిమాండ్ చేశారు. తెలంగాణలోని భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు ఎస్బీఐ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో బ్యాంకు అధికారులు రైతులకు పంట రుణాలు మంజూరు చేశారన్నారు. 2017లో ప్రభుత్వం పోలవరం భూసేకరణకు పొలాలు తీసుకొని పరిహారం చెల్లించిందన్నారు. ఈ సమయంలో బ్యాంకు అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి, రుణ బకాయిలను పరిహారం నుంచి మినహాయించి జమ చేసేలా ఆదేశించిందన్నారు. రైతులు నుంచి పంట రుణాలు చెల్లించుకుందన్నారు. రెండు దఫాలు రికవరీయైన రుణాల్లో ఒక సొమ్ము తిరిగి తమకు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వెలుగు పథకంలో విధులు నిర్వర్తిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వీవోఏలు విజ్ఞప్తి చేశారు. బుట్టాయగూడెంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు రావాల్సిన వేతన బకాయిలు విడుదల చేయించాలని కోరారు. ఆయన స్పందిస్తూ... సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీవోఏలు లక్ష్మీరాధ, కనక, వాగ్దేవి, మౌనిక, నవ్య తదితరులున్నారు.

'ఆశా'ను విధుల్లోకి తీసుకోవాలి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తప్పుడు పత్రాలతో విధుల నుంచి తొలగించిన గండిగూడెం ఆశా కార్యకర్త లక్ష్మీమంగను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట లక్కవరం, ఎర్రగుంటపల్లి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, రాఘవపురం తదితర పీహెచ్‌సీల నుంచి ఆశా కార్యకర్తలు తరలివచ్చి సోమవారం ఆందోళన చేపట్టారు. లక్ష్మీమంగను ఎంఎల్‌హెచ్‌పీ నాగబాబు వేధించడంతో పాటు నకిలీ పత్రాలు సృష్టించి విధుల నుంచి తొలగించేందుకు కారకుడయ్యారన్నారు. అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉద్ధృతం చేస్తామని వారు హెచ్చరించారు. గ్రామంలో నిరసన ప్రదర్శన చేపట్టి... కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు.


టి.నరసాపురం కూడలిలో కార్యకర్తల మానవహారం

ప్రజా సహకారంతో సారా నిర్మూలన


పంచాయతీ కార్యాలయంలో నిద్రిస్తున్న కుక్కునూరు సీఐ రమేశ్, ఎస్సై రామకృష్ణ

కుక్కునూరు, న్యూస్‌టుడే: ప్రజల సహాయ సహకారాలతోనే గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలను నిర్మూలించగలమని సీఐ రమేశ్, ఎస్సై రామకృష్ణ అన్నారు. మారేడుబాకలో ఆదివారం రాత్రి వారు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామస్థులతో సమావేశమై వివిధాంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో సారా తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత కక్షలు, రాజకీయ పార్టీల తగాదాలకెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పౌరులు విచక్షణతో ఆలోచించి సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో నిద్రించారు.

జంగారెడ్డిగూడెం పట్టణం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ కృష్ణబాబు అన్నారు. ఎ.పోలవరంలో ఎస్సై జబీర్ ఆధ్వర్యాన పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాజీకి ఆమోదయోగ్యమైన సమస్యలను ఇరువర్గాలు చర్చించుకుని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 112 నంబరుకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చని తెలిపారు. అనంతరం సచివాలయంలో నిద్ర చేశారు.

ఉన్నవి 3 వేలు... వెలగనివి 2 వేలు



జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అంధకారం అలముకుంది. పట్టణంలో సుమారు 3 వేల వీధి దీపాలున్నాయి. అందులో 2 వేల దీపాలు వెలగడం లేదు. ఫలితంగా ఏ వీధి చూసినా చీకటిమయమే. ప్రధాన, అంతర్గత రహదారులను చీకట్లు కమ్మేశాయి. ఏలూరు, అశ్వారావుపేట రోడ్డు, కొవ్వూరు రోడ్డు, శ్రీనివాసపురం రోడ్డు, మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని సెంట్రల్ లైటింగ్‌లు నెలల తరబడి అలంకారప్రాయంగా మారాయి. వీధి దీపాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు. **- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం**

పద్నాలుగేళ్లుగా సొమ్ము జమ కాలేదని ధర్నా


ప్రదర్శనగా వస్తున్న నాయకులు, గిరిజనులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బుట్టాయగూడెం, పోలవరం మండలాల మారుమూల గ్రామాలైన గోగుమిల్లి, ముంజులూరు, ఉర్రింక, చమలపల్లి, గెడ్డపల్లి, గిన్నేపల్లి పరిధిలో 400 హెక్టార్ల అన్ రిజర్వు భూములను అటవీ శాఖకు అప్పగించారు. జీవనాధారమైన భూములను అటవీశాఖకు అప్పగించడానికి స్థానిక గిరిజనులు అడ్డుచెప్పడంతో 2010లో సింగరేణి సంస్థ గ్రామాల అభివృద్ధికి రూ.కోటి ప్రోత్సాహక నిధుల చెక్కు అందజేసింది. ఆ సొమ్మును పద్నాలుగేళ్లయినా ఇంతవరకు జమ చేయలేదని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యాన కేఆర్‌పురం ఐటీడీఏ ఎదుట సోమవారం గిరిజనులు ధర్నా చేశారు. 'గిరిజన సమస్యల పరిష్కార వేదిక'లో ఏపీవో పీవీఎస్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎస్.రామ్మోహన్, కారం రాఘవ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయంలో 'గిరిజన సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారానికి సుమారు 60 అర్జీలు అందాయని ఏపీవో నాయుడు తెలిపారు. ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమించాలని, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కోరారు.

సామాజిక బాధ్యతగా మొక్కల పెంపకం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు బొర్రంపాలెం శాఖ మేనేజరు మంగరాజు అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా గ్రామంలోని రహదారికి ఇరువైపులా సిబ్బంది, ఖాతాదారులతో కలిసి సోమవారం మొక్కలు నాటారు. పోస్టుమాస్టర్ రమేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల వితరణ

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: కామవరపుకోట మండలం తడికలపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 400 మందికి జనసేన పార్టీ గ్రామాధ్యక్షుడు సింగవరపు హరీశ్ ఆధ్వర్యంలో సోమవారం కంచాలు వితరణ చేశారు. రత్నగిరి నగర్, రెడ్డికాలనీ పాఠశాలల్లోని 41 మంది పిల్లలకూ కంచాలు అందజేశారు. జనసేన మండలాధ్యక్షుడు షేక్‌వలి, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, ఎన్డీయే నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ గడువు పొడిగింపు

కామవరపుకోట(జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: తడికలపూడి మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రవేశ గడువును ఈ నెల 3 వరకు పొడిగించినట్లు ప్రాంగణం మేనేజర్ బి.రెబెక శామ్యూల్ తెలిపారు. గత నెల 23న మహిళలకు 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమైందని, కోర్సులో చేరానుకునే వారు విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు ఫొటోలు జత చేసి కార్యాలయంలో సమర్పించాలని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుల రహిత సమాజాన్ని స్థాపిద్దాం

కుక్కునూరు, న్యూస్‌టుడే: కుల రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్-ప్రజాపంథా) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఎస్కే గౌస్ అన్నారు. బండలబోరు గ్రామంలో సోమవారం కుల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మనుశాస్త్రం పనిని బట్టి కులాలను విభజించిందని, మనుషులంతా ఒక్కటేనన్న సత్యాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. నాయకులు రామారావు, ముత్యాలరావు, సత్యనారాయణ, వీరాస్వామి, సత్యవతి, కన్నమ్మ, రాంబాబు, లక్ష్మయ్య, లక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గౌస్

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

పాడి పశువులకు రాయితీపై దాణా



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: పాడి పశువులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న దాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ అభిలాష్ సూచించారు. నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెం, యనమదల, రావిచర్ల, దిగవల్లి, హనుమంతులవారి గూడెం, ముక్కొల్లుపాడు, తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు సంపూర్ణ మిశ్రమ దాణా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు ముసునూరు రాజాబాబు, పర్వతనేని సాయి, వెంకట రామిరెడ్డి, కామినేని శివకృష్ణ, సర్పంచి లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



సూచనలిస్తున్న ఎస్సై రాజారెడ్డి

ముసునూరు, న్యూస్‌టుడే: సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు, వేధింపులు, బెదిరింపులకు గురికాకుండా ఉండేదుకు సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఇన్‌ఛార్జి ఎస్సై కె.రాజారెడ్డి అన్నారు. సోమవారం ముసునూరు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సంక్షేమాధికారిణి హేమబిందు, మహిళా పోలీసులు సుందర్‌రాణి, దుర్గాభవాని పాల్గొన్నారు.



నూజివీడు: ఎంపీడీవోకు స్వాగతం పలుకుతున్న పంచాయతీ రాజ్ ఉద్యోగులు

బాధ్యతల స్వీకరణ

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ఎంపీడీవోగా సి.రాఘవేంద్రనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన వి.ఎ.విజయకుమార్ ఉద్యోగ విరమణ చేశారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా రాఘవేంద్రనాథ్ నూజివీడు వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండల విద్యుత్తు ఏఈగా బిల్లా పూర్ణచంద్రరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన పేర్ని రవికుమార్ కైకలూరుకు బదిలీ అయ్యారు. చందర్లపాడు నుంచి పూర్ణచంద్రరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.



కైకలూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు కైకలూరు మండల గ్రామీణ ఏఈగా పి.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముదినేపల్లి మండల ఏఈగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. విద్యుత్తు వినియోగదారులు, ఆక్వా రంగ రైతులకు విద్యుత్తు సరఫరాలో ఎటువంటి సమస్యలు రాకుండా నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

ఆసుపత్రులు కిటకిట

జ్వరాలతో చిన్నారుల విలవిల

నూజివీడు, న్యూస్‌టుడే

విష జ్వరాలతో చిన్నారులు విలవిల్లాడుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ట్యూషన్లకు గైర్హాజరు అయ్యే పిల్లల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పాఠశాలల్లో ఇరుకు గదుల్లో ఉండే చిన్నారులు త్వరగా ఇన్ఫెక్షన్ బారిన పడుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులను ఎవరిని కదిలించినా జలుబు, దగ్గు, జ్వరం ఉన్నాయనే చెబుతున్నారు. గతంలో పిల్లలకు జ్వరం, దగ్గు, జలుబు వస్తే రెండు మూడు రోజుల్లో తగ్గేది. ఇప్పుడు సుమారు వారం రోజులు పడుతోందని వైద్యులు చెబుతున్నారు. ఆసుపత్రికి పిల్లల్ని తీసుకు వెళ్తే అన్ని రకాల పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ఇంట్లో ఓ పిల్లాడికి జ్వరం వస్తే అందరికీ వ్యాప్తి చెందుతోంది.

నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఓపీ

సాధారణ రోజుల్లో	ప్రస్తుతం
350	500



తరగతి గదిలో తక్కువగా ఉన్న విద్యార్థులు

నిర్లక్ష్యం చేయొద్దు..

పిల్లల్లో ప్రస్తుతం ఎక్కువ మంది వైరల్ జ్వరాలు, ఫ్లూ, ఇన్ఫెక్షన్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పిల్లల్లో సహజ నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వారు త్వరగా జ్వరం బారినపడుతున్నారు. లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వాసుపత్రులకు తీసుకెళ్లి పరీక్షలతో చికిత్స చేయించాలి. - డా.సీహెచ్. ప్రవీణ్ చంద్ర, చిన్నపిల్లల వైద్యుడు, నూజివీడు ఏరియా ఆసుపత్రి

■ నూజివీడుకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి తొలుత జ్వరం వచ్చింది. ఆ తర్వాత ఆయన కుమారులు ఇద్దరూ జ్వరం బారిన పడ్డారు. పెద్ద కుమారుడిని ఆసుపత్రిలో చేర్పి చికిత్స అందించాల్సి వచ్చింది. వారి నుంచి ట్యూషన్‌లో మరొకరికి అలా 10 మందికి జ్వరాలు సోకాయి.

■ ఆగిరిపల్లికి చెందిన ఓ కుటుంబంలో తొలుత ఉద్యోగ చిన్నారికి జ్వరం వచ్చి వారం రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి వచ్చింది. ఆ కుటుంబంలోనే మరో ఇద్దరు చిన్నారులు ఆసుపత్రి పాలయ్యారు. ఆ పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో ప్రతి తరగతిలోనూ జ్వర పీడితులు ఉన్నారు.

మురుగు తొలగింది..

స్పందనకు స్పందన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి-ఈదర ప్రధాన రహదారిలో మెట్టుకోనేరు సమీపంలో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోంది. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 30న 'మేమున్నాం.. మీకు తోడుగా..' శీర్షికతో వార్త ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి జొన్నెలగ ప్రసాద్ కథనానికి స్పందించారు. మురుగు రహదారిపైకి పారకుండా చర్యలు చేపట్టారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అమ్మాలి

ముసునూరు, న్యూస్‌టుడే: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అమ్మాలని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం ఎరువుల నాణ్యత నియంత్రణలో భాగంగా సెప్టెంబర్ నెలకు కేటాయించిన మూడు ఎరువుల నమూనాలను నాణ్యత పరీక్ష కోసం ముసునూరు మండలం చెక్కపల్లి మన గ్రోమోర్ సెంటర్‌లో సేకరించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఏదైనా వ్యత్యాసం గుర్తించినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు దస్త్రాలు తనిఖీ చేశారు. వీహెచ్‌ఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న మధుమోహన్

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో భవానీశంకరి

నూజివీడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(మీ-కోసం)లో వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేయాలన్నారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, క్లిష్టమైన సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆర్డీవో వై.భవానీశంకరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు



కైకలూరు: ఉపవాస దీక్షలో పాల్గొన్న నాయకులు

కలిదిండి, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా సోమవారం సానారుద్రవరంలోని రామాలయం వద్ద కూటమి నాయకులు 'లక్ష ఒత్తులు వెలిగించి' పూజలు చేశారు. నల్లగోపుల చలపతి, కాళ్లపాలెం బుజ్జి, ఉడ్డగిరాజు సుభాషిణి, సాన మీనాసరస్వతి, జడ్డు సుబ్రమణ్యం, చిట్టూరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల ఉపవాసం.. కైకలూరు, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం అపవిత్రం అయిన నేపథ్యంలో కైకలూరు జనసేన నాయకులు ఉపవాస దీక్ష చేపట్టారు. కైకలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. జనసేన జిల్లా సమన్వయకర్త కొమిడి శివబాబు, నాయకులు నల్లగోపుల చలపతి, కొల్లి వరప్రసాద్, వీరంకి వెంకయ్య, చిట్టూరి రవీంద్ర, జడ్డు సుబ్రహ్మణ్యం, కాళ్లపాలెం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో అద్భుత పాలన

మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో అవినీతి రహితంగా ఎంతో అద్భుతమైన పాలనను అందించినట్లు నాయకులు సజ్జా సురేశ్‌కుమార్ అన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచి రాదారాగాద్రరావు, గుంటూరి సత్యనారాయణ, అడుసుమిల్లి రమణ, మరియదాసు, బోయిన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు

సినీ మాల

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దేవర
ఆగిరిపల్లి: శ్రీ అను డీలక్స్	కళింగ
కైకలూరు	
విజయలక్ష్మి జీ సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	సత్యంశివం
శ్రీవెంకటరమణ సినిమాస్	దేవర
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

చలో కాకినాడను విజయవంతం చేద్దాం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా చలో కాకినాడ కార్యక్రమానికి మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని మహాసేన రాజేశ్ పిలుపునిచ్చారు. కొమ్మరలో చలో కాకినాడ గోడపత్రాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 50 లక్షల మంది మాలలు ఏం కోరుకుంటున్నారో కేంద్రానికి తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మాలలు ఐక్యంగా ముందుకు సాగుతూ తమ హక్కులు కాపాడుకోవాలని కోరారు. అనంతరం ఆయన్ను పలువురు సత్కరించారు.

విద్యార్థులపై పర్యవేక్షణ అవసరం



వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, న్యూస్‌టుడే: వసతి గృహ విద్యార్థులపై పర్యవేక్షణ అవసరమని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని న్యాయమూర్తి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, తాగునీరు, భోజనం, మెనూ, హాజరు దస్త్రాలను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యాభ్యాసం ఉండాలని, సాటి విద్యార్థులతో స్నేహపూరితంగా మెలగాలని సూచించారు. న్యాయవాది ఎంఎస్ఎన్.రాజు, వార్డెన్ నిర్మల, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చాట్రాయి, న్యూస్‌టుడే: పోలవరం, చీపురుగూడెం ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు లైన్లు మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

లింగపాలెం, న్యూస్‌టుడే: వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల లీగల్ సర్వీసు కమిటీ ఛైర్మన్, చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి సీహెచ్ మధుబాబు ఆదేశించారు. లింగపాలెం, ధర్మాజీగూడెంలోని బాలుర, బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దస్త్రాలు, వసతులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది రాకపోకలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ధర్మాజీగూడెం బాలికల వసతి గృహంలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణంలో పలువురు విజ్ఞప్తి చేయగా.. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. లీగల్ సర్వీసు కమిటీ సభ్యుడు ఆక్బర్ అలీ, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అంతరానితనాన్ని రూపుమాపాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని ఎస్సై ఆవుల శ్రీనివాసరావు అన్నారు. పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవం (సివిల్ రైట్స్ డే) పురస్కరించుకుని సోమవారం పెదకామనపూడిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సర్పంచి సైదాల శ్రీనివాసరావు, వీఆర్వో కాగిత మురళి, పంచాయతీ కార్యదర్శి సంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

'భాజపా సభ్యత్వాలకు ఆదరణ'

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి విశేష ఆదరణ వస్తుందని, స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరణకు ముందుకు వస్తున్నారని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొటప్రోలు కృష్ణ అన్నారు. గురజలో సోమవారం నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం నాయకులు పత్తిమిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో 73 మందికి సభ్యత్వాలు అందించారు.

పూడికతీత పనులకు శ్రీకారం

ముసునూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలసపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆ గ్రామంలో పర్యటించిన మంత్రికి స్థానికుల మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షాలు వచ్చినప్పుడు నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి చేరి నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు సోమవారం మంత్రి జేసీబీని పంపించడంతో సర్పంచి చలసాని దామోదరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్ర ఆధ్వర్యంలో పలు వీధుల్లో పూడికతీత పనులు చేపట్టారు.

బిందు సేద్యం పరికరాలు అందజేత

చాట్రాయి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన బిందు సేద్యానికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా నాయకులు మందలపు రాజారావు కోరారు. తుమ్మగూడెంలో సోమవారం రైతులకు ఆయన బిందు సేద్యం పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఐదు ఎకరాలకు 90 శాతం రాయితీ, ఆపై ఉన్న రైతులకు 50 శాతం రాయితీని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చాగంటి వేణు తదితరులు పాల్గొన్నారు.

పాతూరి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పిన్నమనేని


ముదినేపల్లి, న్యూస్‌టుడే: చేవూరుకు చెందిన సీనియర్ తెదేపా నాయకుడు, మాజీ సర్పంచి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాతూరి రంగారావు (రాజా) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సోమవారం మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ, గ్రామాభివృద్ధికి రాజా చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాబీ బచ్చుల అర్జునుడు అనుచరులు... వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్, పార్టీ మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రిచౌదరి, నియోజకవర్గ సమన్వయకర్త వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం.. అన్నదాతకు పూర్వవైభవం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రిజర్వాయర్లు, డ్రెయిన్లు, చెరువుల మరమ్మతు పనులు చేయలేదు. అధి ప్రస్తుతం శాపంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పిల్ల కాలువల నుంచి పెద్ద డ్రెయిన్ల వరకు గండ్లు పడి వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. మరో పక్క, డ్రెయినేజీల్లో గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు చేయకపోవడంతో వరద రోజుల తరబడి పొలాల్లోకి మురుగునీరు ఎగదన్ని పంటలకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో జలవనరులను బలోపేతం చేయడంతో పాటు ప్రతి ఎకరాకు సాగు నీరందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రైతు ప్రతినిధులను ఎన్నుకోవడానికి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఉత్తర్వులిచ్చింది. ఓటర్ల జాబితా ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు తొలి వారానికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కైకలూరు నియోజకవర్గంలో..

ప్రధాన కాలువలు	
పోలరాజ్, క్యాంప్‌బెల్, బీఎండీ ఛానల్	
సాగునీటి సంఘాలు:	28
సాగునీటి పంపిణీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీలు)	6
ప్రాజెక్టు	కృష్ణా డెల్టా ప్రాజెక్టు



బీఎండీ ఛానల్‌కు పడిన గండి పూడ్చుతున్న రైతులు

నెల వ్యవధిలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు

కమిటీలు ఇలా.. ప్రతి కాలువ కింద ఆరుగురు నుంచి 12 మందితో ప్రాదేశిక నియోజకవర్గాలుగా గుర్తిస్తారు. ఇందులో ప్రతి ఆయకట్టుదారుడు రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. వీరంతా నీటి వినియోగదారుల సంఘాన్ని ఎన్నుకుంటారు. వీటి ఛైర్మన్లను ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. వీరంతా కలిసి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు.

సంఘాలతో మెరుగైన సేవలు

నీటి వినియోగదారుల సంఘాల ఛైర్మన్లు ఆయా కాలువల కింద సాగునీరు సక్రమంగా అందేలా చూస్తారు. అత్యవసర పనులపై అధికారులకు సమాచారమిచ్చి యుద్ధ ప్రాతిపదికన ఆయేలా చూస్తారు. వరదలు, భారీ వర్షాల సమయంలో కాలువలు, డ్రెయిన్ల గట్ల పరిస్థితి అధికారులకు తెలియజేసి అవసరమైన చర్యలు చేపడతారు.

జవాబుదారీతనం ఉంటుంది

సాగునీటి సంఘాలు లేకపోవడంతో రైతులకు సమాధానం చెప్పేవారు కరవయ్యారు. ఎన్నికల నిర్వహించడం ద్వారా కమిటీలు వస్తే జవాబుదారీతనం ఉంటుంది. సమర్థులు ఎన్నికయ్యేలా ఎన్నికల నిర్వహించాలి. - చిన్నం మాధవ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, వణుదుర్రు



నినాదాలు చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఆందోళన

నూజివీడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం నూజివీడులోని ప్రభుత్వ బాలికల కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు శివకుమార్, ఆకాశ్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 ఏపీ క్రికెట్ జట్టుకు ఎంపిక



సాయి ప్రకాశ్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అండర్-19 ఏపీ క్రికెట్ జట్టుకు ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ విభాగంలో రెండో ఏడాది చదువుతున్న తాతా సాయి ప్రకాశ్ ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ డా.రావి వెంకటరావు తెలిపారు. అక్టోబర్ 4న పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు గాంధీ నగర్‌కు చెందిన ఎర్రంశెట్టి శ్రీకాంత్ (27) కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఆర్థిక ఇబ్బందులతో ఎలుకల మందు పెరుగులో కలిపి తిని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు, బంధువులు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.



విజేతలతో ఉపాధ్యాయులు

తాడినాడ విద్యార్థులకు బహుమతులు

కలిదిండి, న్యూస్‌టుడే: క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ సైన్స్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తాడినాడ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బహుమతులు సాధించినట్లు హెచ్ఎం డి.ఉమాదేవి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, వారిలో 30 మందిని విజేతలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. విజేతలతో పాటు ఆర్ట్ మాస్టారు గొరిపర్తి వెంకటరెడ్డి, చిత్రలేఖనం మాస్టారు నాగరాజును సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

బాలల అవసరాలు- హక్కులపై శిక్షణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: బాలల కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, సిబ్బంది బాలల అవసరాలు-హక్కులపై అవగాహన పెంచుకోవాలని బాలల హక్కుల కార్యకర్త గోదే ప్రసాద్ అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ బాలల వసతి గృహంలో పనిచేస్తున్న అధ్యాపకేతర సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2న స్వచ్ఛ భారత్ దివస్

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛ భారత్ మిషన్ ప్రవేశపెట్టి పదేళ్లు అయిందని, ఈ సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్ ఘనంగా నిర్వహించాలని కోరారు.

మూడు దశాబ్దాలుగా.. విస్తరణకు నోచక!



ఎదురుగా వాహనాలు వస్తే ద్విచక్ర వాహనదారులకు పాట్లే



చాట్రాయి సమీపంలో గొయ్యి

చాట్రాయి, న్యూస్‌టుడే: విస్సన్నపేట-వెంగలపల్లి రహదారి మూడు దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సత్తుపల్లి-విజయవాడ రాష్ట్రీయ రహదారిలో ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట నుంచి ఏలూరు జిల్లా వెంగలపల్లి వరకూ ఈ రహదారి ఉంది. ఇదే మార్గంలో చాట్రాయి, పోలవరం, మంకొల్లు గ్రామాలుండగా సింగిల్ రోడ్డుతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సత్తుపల్లి, కల్లూరు, తిరువూరు ప్రాంతాలకు చెందిన భక్తులు ఇదే మార్గంలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమలకు నిత్యం వెళ్తుంటారు. ఒక వరుస రహదారి, అందులోనూ గోతులతో వారికి అవస్థలు తప్పడంలేదు. ఈ విషయమై నూజివీడు ఆర్.అండ్.బీ శాఖ డీఈ బాబూరావును సంప్రదించగా.. గతంలో రూ.18 కోట్లకు కేంద్ర ప్రభుత్వ నిధులకు ప్రతిపాదన చేశామన్నారు. త్వరలోనే గోతులకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

చెత్త కుండీ.. రంధ్రాలతో నిండీ!

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన కుండీల వద్ద అపరిశుభ్రత నెలకొంది. నూజివీడు పట్టణంలో ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన ఐనప చెత్త కుండీలకు పడిన రంధ్రాల నుంచే చెత్త కింద పడిపోతుంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు చెబుతున్నారు. కింద పడిన చెత్తను పశువులు, మేకలు మేస్తూ.. చెల్లా చెదురు చేస్తున్నాయని ప్రజలు ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన కుండీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించగా.. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు.



పట్టణంలోని అమ్మవారి గుడి సమీపంలో..



ఎల్ఐసీ ఆఫీసు వద్ద ఇలా..



పట్టణంలోని శ్రీనివాస థియేటర్ కూడలి వద్ద రంధ్రాలతో చెత్త కుండీ